RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 172 | జూన్ 3, 2025 | వెల : రూ.3-00



త్వరలోనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

4లో..



## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే

# మా ఎజెండా

- పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థల ప్రక్షాళనే ధ్యేయం
- 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలోనే నంబర్ వన్ చేస్తాం
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

2047 నాటికి దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో పారదర్శకమైన పరిపాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించడానికి ప్రజలందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలన్న ఆంకాక్షను వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్ కితాక్యూషూ మేయర్ కజుహిసా టక్యూచీ రాష్ట్ర అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణను అభివృద్ధి పథంవైపు నడిపించడంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అనుసరిస్తున్న ప్రణాళికలను వివరించారు. "దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆ దిశగానే తెలంగాణ రైజింగ్ 2047 భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వచ్చే పదేళ్లలో 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇది నల్లేరుపై నడక కాదని తెలుసు. అయినా ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదిలాం. ప్రజల ఆలోచనలే ఆచరణగా ముందుకు వెళుతున్నాం" అని చెప్పారు. ప్రజా ప్రభుత్వ లక్ష్య సాధన కోసం ప్రధానంగా మహిళలు, రైతు సంక్షేమం, యువత, విద్య, వైద్య రంగాల్లో ఇప్పటివరకు సాధించిన ప్రగతిని వివరిస్తూ భవిష్యత్తు ప్రణాళికలను ఆవిష్కరించారు. సామాజిక తెలంగాణ కోసం బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిగ్రేటెట్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వంటి సామాజిక తెలంగాణ నిర్మాణానికి తీసుకున్న నిర్ణయాలను వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి మూసీ పునరుజ్జీవం పథకం, భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, మెట్రో రైలు విస్తరణ ప్రణాళికలు, విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలను తెలిపారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్ర అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాలు

మిగతా 4వ పేజీలో..




## న్యాయపోరాటానికి పెరుగుతున్న మద్దతు..!

- కదిలిన ప్రజాసంఘాలు
- ఎనిమిదో రోజుకు మిట్టపెల్లి వారసుడి ధర్నా
- వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దళితరత్న నమిండ్ల చిన్నస్వామి మద్దతు
- వారసత్వంగా అరవింద్‌కు రావాల్సిన వాటా ఆస్తిని ఇవ్వాల్సిందేనని డిమాండ్

**వేద న్యూస్, వరంగల్:**

'వారసుడి న్యాయపోరాటం' శీర్షికన "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో ఈ నెల 1న ప్రచురితమైన కథనానికి ప్రజాసంఘాలు స్పందించాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తి(హవేలి)లో తన తండ్రి ఆస్తిలో వాటా కోసం తనయుడు ధర్నా చేస్తున్నాడు. తల్లితో కలిసి ఊరిలో టెంట్ వేసుకుని తండ్రి ఫొటోతో నిరసన తెలుపుతున్నాడు. వివరాల్లోకెళితే.. ఎలుకుర్తి గ్రామవాస్తవ్యులు మిట్టపల్లి రాజేశ్వర్‌కి ముగ్గురు కుమారులు.. పెద్ద కుమారుడు కరుణాకర్, రెండో కుమారుడు శ్రీనివాస్, మూడో కుమారుడు రాజు. కాగా, 17 ఏళ్ల క్రితం మిట్టపల్లి శ్రీనివాస్ చనిపోయారు. తన కుమారుడైన మిట్టపల్లి అరవింద్.. తన తల్లి స్వరూపతో కలిసి తమకు రావలసిన ఆస్తి కోసం ధర్నా చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మెంబర్ నమిండ్ల చిన్నస్వామి సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. అరవింద్ చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు. వాటా ప్రకారం అరవింద్‌కు రావాల్సిన ఆస్తిని ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు.

మిట్టపల్లి అరవింద్‌కు రావలసిన ఆస్తి మూడెకరాల విషయమై.. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినా అరవింద్ పెదనాన్న, బాబాయ్‌లు అంగీకరించడం లేదని చెప్పారు. పోలీస్ స్టేషన్ కు వెళ్లినా వారు స్పందించడం లేదని చెప్పారు. వారి తీరు ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున దళిత సంఘాల నాయకులమంతా ఏకమై.. వారికి న్యాయం జరిగే వరకూ వారి వెంటే ఉంటామని స్పష్టం చేశారు. అరవింద్‌కు న్యాయం జరిగే వరకూ వారికి అండగా ఉంటామని చెప్పారు. భీమగాని సౌజన్య కూడా అరవింద్ న్యాయపోరాటానికి మద్దతు తెలిపారు. త్వరలో పరిష్కార మార్గాన్ని చూపుతామని హామీ ఇచ్చారు.



వారసుడి
న్యాయ పోరాటం

- తండ్రి ఆస్తిలో వాటా కోసం కుమారుడి నిరాహార దీక్ష
- గీసుగొండ మండలం ఎలుకుర్తి (హవేలీ)లో..

వేద న్యూస్, వరంగల్:

"రక్తం పంచుకు పుట్టిన తనయుడికి తండ్రి ఆస్తి దక్కకుండా కుటుంబీకులు అడ్డు పడుతుండడంతో.. ఆ ఇంటి వారసుడైన కుమారుడు న్యాయపోరాటం చేస్తున్నాడు. ఊరిలో టెంటు వేసుకొని నిరాహార దీక్ష చేస్తూ.. తనకు న్యాయం చేయాలని ఊరి ప్రజలను, పెద్ద మనుషులను కోరుతున్నాడు." స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం..

ఎలుకుర్తి (హవేలీ) గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ 17 ఏళ్ల క్రితం మృతి చెందారు. ఆయన కుమారుడైన మిట్టపల్లి అరవింద్ తన తల్లితో కలిసి ఇన్నాళ్లు తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నాడు. అయితే, ఈ సమయంలో తన నానమ్మ బాగోగుల నిమిత్తం ఊరికి వచ్చి పోతూ ఉండేవాడు. నాయనమ్మ బాగోగులను తల్లితో కలిసి అరవింద్ చూసుకోవడంతోపాటు.. నానమ్మ కాలం చేసిన సందర్భంగా

మిగతా 4వ పేజీలో..



## రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర మరువలేం

### ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు

**వేద న్యూస్, ఆసిఫాబాద్:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు ఐపీఎస్, మొదట పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించి, ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు పోలీసు అధికారులకు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 2014, జూన్ 2న, అధికారికంగా ఏర్పడిందన తెలంగాణ రాష్ట్రం నేటితో పదకొండు సం. పూర్తి చేసుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం, అభివృద్ధి చెందడంలో రాష్ట్రం కోసం జీవితాల్ని త్యాగం చేసిన అమరవీరుల పాత్ర ఎంతో ఉందని

మిగతా 4వ పేజీలో..

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

- జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ మైదానంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశిస్తూ జిల్లా ప్రగతి గురించి వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, శ్రీపాల్ రెడ్డి, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్ లతో కలిసి స్వాతంత్ర సమరయోధులను సన్మా నించారు. తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే



నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింప జేశాయి. ఈ సందర్భంగా మంత్రి చేతులమీదు గా రైతులకు విత్తనాలను పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలియజేస్తూ ప్రదర్శించిన శకటాలు, ఏర్పాటుచేసిన స్టాల్స్‌లను మంత్రి సందర్శించారు. అంతకుముందు ఖిలా వరంగల్ మధ్యకోటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పిం చిన త్యాగధనులకు ఘనంగా నివాళులు అర్పించారు.







## భూభారతి రెవెన్యూ సదస్సులు

### 3 నుండి 19 తేదీ వరకు : తహసిల్దార్

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలం పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న భూభారతి రెవెన్యూ సదస్సుల తేదీలను తహసిల్దార్ కల్వల సత్యనారాయణ విడుదల చేశారు. ఇందులో భాగంగా ఈనెల 3 నుంచి 19వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. 3న పత్తిపాక (గవర్నమెంట్ స్కూల్), 4న హుస్సేన్ పల్లి (గ్రామ పంచాయతీ), 5న నేరేడుపల్లి (గవర్నమెంట్ స్కూల్), 6న కాట్రపల్లి (గవర్నమెంట్ స్కూలు), 9న వసంతపూర్ (గ్రామపంచా యతీ), 10న పెద్ద కొడపాక (రైతు వేదిక), 11న గట్ల కానిపర్తి (రైతు వేదిక),12న మైలారం (గవర్నమెంట్ స్కూల్),13న కొత్తగట్టు సింగారం (గవర్నమెంట్ స్కూల్),16న తహరాపూర్(గవర్నమెంట్ స్కూల్),17న కొప్పుల (గవర్నమెంట్ స్కూల్),18న ప్రగతి సింగారం (రైతు వేదిక). 19న శాయంపేట (రైతు వేదిక) నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేద న్యూస్

మంగళవారం, జూన్ 03, 2025

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ నగరం 43, 44 డివిజన్లో ఉద్యమకారులు మేకల సురయ్య, ఇల్లందుల రవి, గ్రామ పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జెండా,జాతీయ జెండాలను ఆవిష్కరించారు. 44వ డివిజన్ ఉద్యమకారులు మేకల సూరయ్య ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించగా జెండాకు వందనం నిర్వహించి అనంతరం బిఆర్ఎస్ పార్టీ జెండాను 43వ డివిజన్ ఉద్యమకారులు ఇల్లందుల రవి ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ గేయాన్ని ఆలపించారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంలో బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ సారథ్యంలో ఎనలేని కృషి చేసిందని అలాగే అమరవీరులు సకలజనులు అందరి అండదండలతో కెసిఆర్ సారథ్యంలో కేంద్రం మెడలు వంచి నాలుగున్నర కోట్ల ప్రజల తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చే విధంగా నేటి దినంలో ప్రత్యేక రాష్ట్రాన్ని మనం సాధించుకున్నామని అన్నారు.డివిజన్లోని ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే జన్మదినం జరుపుకుంటున్న మేకల జయశ్రీ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ తిమ్మాపురం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేకల నాగరాజు, తిమ్మాపురం ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు బండి కనకరాజు, ఝాన్సీ నగర్ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి గొల్లపల్లి వీరస్వామి, బిఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దలు మండల సారయ్య, ఆవునూరి బుచ్చయ్య,



ముప్ప సారంగపాణి, మేకల నారాయణ, కొత్త పెల్లి సారమ్మ ,లక్క కృష్ణ ,ఇల్లందుల జనార్ధన్, బండి గట్టయ్య ,తిప్పారపు రాజు, టెంట్ హౌస్ జానీ ,అనిల్ తదితరులు రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మిఠాయిలు పంచి పెట్టుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## సర్కారు బడుల్లో
# చేర్పించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఖిలా వరంగల్ మండలం ఎంపీపీ ఎస్ తిమ్మాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి స్వరూప ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట బ్యానర్ చేతబట్టి తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని చైతన్యం కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నాణ్యమైన విద్యను పొంది భావి భారత పౌరులుగా అవతరిస్తారని, కార్పొరేట్ స్కూల్ల మాయలో తల్లిదండ్రులు పడకుండా అధిక ఫీజులు చెల్లిస్తూ అప్పుల పాలు కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని గల్లీ గల్లీలో ఈ సందర్భంగా ప్రచారం నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి కవిత, ఏపీపీ చైర్మన్ నాగలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.



## మద్దతు పలికి వెంటనే
# పోస్ట్ డిలీట్

- కన్నడ భాషపై కమల్ హాసన్ వ్యాఖ్యలతో కర్ణాటకలో వివాదం
- 'థగ్ లైఫ్' సినిమా విడుదలను అడ్డుకుంటామని హెచ్చరికలు
- బెదిరింపులను 'గూండాయిజం'గా అభివర్ణించిన రామ్ గోపాల్ వర్మ
- కమల్ క్షమాపణ చెప్పాలని కర్ణాటక నేతలు, సంఘాల డిమాండ్
- 'థగ్ లైఫ్' సినిమా విడుదల రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించిన కమల్

**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ నటుడు కమల్ హాసన్ కన్నడ భాష గురించి చేసిన ఓ వ్యాఖ్య కర్ణాటకలో తీవ్ర వివాదానికి దారితీసింది. దీని ప్రభావం ఆయన నటిస్తున్న 'థగ్ లైఫ్' సినిమా విడుదలపై పడేలా కనిపిస్తోంది. ఈ వివాదంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా స్పందించారు. ఇటీవల ఓ ప్రచార కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడుతూ, "కన్నడ భాష తమిళం నుండే పుట్టింది" అని వ్యాఖ్యానించారు. ఈ మాటలు కర్ణాటక వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. కమల్ హాసన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకపోతే 'థగ్ లైఫ్' సినిమాను రాష్ట్రంలో విడుదల కానివ్వబోమని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హెచ్చరించింది. దీంతో భాషా పరమైన, రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి, ఈ అంశం ఓ సాంస్కృతిక, న్యాయపరమైన సమస్యగా మారింది. ఈ వివాదంపై స్పందించిన ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, 'థగ్ లైఫ్' సినిమాపై వస్తున్న బెదిరింపులను తప్పుపట్టారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ (గతంలో ట్విట్టర్) లో ఆయన స్పందిస్తూ, "ప్రజాస్వామ్యానికి కొత్త పేరు అసహనం... కమల్ హాసన్ క్షమాపణ చెప్పకపోతే 'థగ్ లైఫ్' సినిమాను నిషేధిస్తామని బెదిరించడం ఒక రకమైన గూండాయిజం" అని పేర్కొన్నారు. అయితే, ఈ పోస్ట్‌ను ఆయన కొద్దిసేపటికే తొలగించినప్పటికీ, బెదిరింపుల ద్వారా సెన్సార్‌షిప్ విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ భారత భాషల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను వివరించే క్రమంలో కమల్ హాసన్ చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కన్నడ భాషకు తమిళమే మూలమన్న ఆయన వాదనను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బహిరంగంగానే తోసిపుచ్చారు. కన్నడ భాషకు స్వతంత్ర వారసత్వం ఉందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, పలు కన్నడ సంఘాలు కూడా కమల్ హాసన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, అధికారికంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. అయితే, కమల్ హాసన్ మాత్రం ప్రజాస్వామ్యంపై తనకు నమ్మకం ఉందని, తన వాదన తప్పని నిరూపిస్తేనే క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు. సినిమా విడుదలపై నిషేధం విధించాలన్న డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో, 'థగ్ లైఫ్' సినిమాను కర్ణాటకలో ప్రశాంతంగా విడుదల చేసుకునేందుకు రక్షణ కల్పించాలని కోరుతూ కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంపై కేఎఫ్‌సీసీ అధ్యక్షుడు ఎం. నరసింహులు మాట్లాడుతూ, "ఇది కేవలం సినిమా పరిశ్రమకు సంబంధించిన విషయం మాత్రమే కాదుబీ ఇది మన రాష్ట్ర గౌరవానికి సంబంధించినది" అని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలతో 'థగ్ లైఫ్' సినిమా విడుదలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

## కమల్ హాసన్ వ్యాఖ్యలను
# రాజకీయం చేయొద్దు

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

కన్నడ భాషపై ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అయితే, ఈ విషయమై తాను మాట్లాడదలుచుకోలేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఈ అంశానికి సంబంధించిన చరిత్ర తనకు తెలియదని అన్నారు. కర్ణాటక, తమిళనాడు మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉండాలని, ఈ విషయాన్ని రాజకీయం చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

'దీన్ని మనం రాజకీయ అంశంగా మార్చొద్దు. మనం ఇరుగుపొరుగు వారము. శత్రువులం కాదు. అందరం కలిసిమెలిసి జీవించాలి. కర్ణాటక నీళ్లు తమిళనాడుకు వెళతాయి. అక్కడి వారు ఇక్కడకు వస్తుంటారు. నాకు ఈ అంశానికి సంబంధించి చరిత్ర గురించి తెలియదు. అందుకే, దీనిపై మాట్లాడదలుచుకోలేదు' అని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. అంతకు మునుపు సీఎం సిద్ధరామయ్య కమల్ హాసన్‌ను విమర్శించారు. 'కన్నడ భాషకు సుదీర్ఘ చరిత్ర ఉంది. పాపం కమల్ హాసన్‌కు ఈ విషయం తెలియదు' అని ఇటీవల ఓ సమావేశంలో అన్నారు. తన తాజా చిత్రం థగ్ లైఫ్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరులో కమల్ హాసన్ మాట్లాడుతూ తమిళ భాష నుంచి కన్నడ వచ్చిందని



అన్నారు. దీంతో, ఒక్కసారిగా వివాదం చెలరేగింది. వివిధ కన్నడ సంఘాలు నిరసనలకు తెరతీశాయి. కమల్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. కన్నడ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ భగ్గుమన్నాయి. క్షమాపణలు చెప్పకపోతే సినిమాను బ్యాన్ చేస్తామని హెచ్చరించాయి. కమల్ హాసన్ మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తన తప్పు ఉంటే క్షమాపణలు చెప్పి ఉండే వాడినని అన్నారు. సినిమాపై నిషేధం హెచ్చరికల గురించి కూడా స్పందించారు. తనకు న్యాయం, చట్టంపై నమ్మకం ఉందని చెప్పారు. భారత్ ప్రజాస్వామిక దేశమని అన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కన్నడ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్.. థగ్ లైఫ్ సినిమా రాష్ట్రంలో విడుదల కాకుండా బ్యాన్ చేసింది.



# పాఠశాల విద్యార్థులకు పండగలాంటి వార్త చెప్పిన ఏపీ సర్కార్

**వేద న్యూస్, విజయవాడ :**

'పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహార భోజనం అందించేందుకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింద'ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ తెలిపారు. జూన్ 12వ తేదీ నుంచి రాష్ట్రంలోని 41వేల ప్రభుత్వ పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టల్స్‌కు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు. ఏ రైతు అయితే ఈ బియ్యం పండించారో%%% ఆయన చేతుల మీదుగానే పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ కు బియ్యం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకి గౌరవం కల్పిస్తామన్నారు. దేశానికి వెన్నెముక రైతు అని, రైతు లేనిదే రాష్ట్రం లేదని, అటువంటి రైతాంగానికి అండగా నిలబడటం ప్రభుత్వంగా తమ బాధ్యతని తెలిపారు. మూడు పార్టీల కలయికతో బలంగా ఉన్న మార్కెట్ యార్డ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, భవిష్యత్తులో వీరంతా కలసి, యార్డును మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలం కొడాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా తోట కనకదుర్గ రాజశేఖర్, వైస్ ఛైర్మన్ గాఅత్తలూరి గోపిచంద్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గౌరవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ "అకాల వర్షాలు, వరస ప్రకృతి విపత్తులతో ఈ ప్రాంత రైతాంగం ఎంతలా నష్టపోయిందో కళ్లారా చూశాం. రోడ్లపై ధాన్యాన్ని రాశులుగా పోసి కన్నీరు కార్చిన సందర్భాలు కోకొల్లలు. అన్నదాతల్లో ధైర్యం నింపడానికి ఆ రోజు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఈ ప్రాంతాల్లో పర్యటించారు. తక్షణ నష్టపరిహారం రైతులకు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా వైసీపీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వం రైతులను ఎంతలా వేధించింది అంటే వారికి అనుకూలమైన మిల్లులకే ధాన్యం అమ్మాలని రైతులపై ఒత్తిడి తీసుకొచ్చారు. వందల కిలో మీటర్లు దూరంలో ఉన్నా అక్కడికే వెళ్లి ఇవ్వాలని ఇబ్బందిపెట్టేవారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి నెలలు, సంవత్సరాల తరబడి డబ్బులు చెల్లించేవారు కాదు.

## 2.5 టన్నుల పేలుడు
# పదార్థాలు స్వాధీనం



**వేద న్యూస్, డెస్క్:**

ఒడిశా–ఝార్ఖండ్ సరిహద్దుల్లో మావోయిస్టులు భారీ విధ్వంసానికి పన్నిన కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. మావోయిస్టులు దాచిపెట్టిన సుమారు 2.5 టన్నులకు పైగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఈ భారీ ఆపరేషన్‌లో ఒడిశా రాష్ట్ర స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజీ), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), ఝార్ఖండ్ ఎలైట్ జాగ్వార్ ఫోర్స్, సుందర్‌గఢ్ డిస్ట్రిక్ట్ వాలంటరీ ఫోర్స్ (డీవీఎఫ్) కు చెందిన భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. ఈ పేలుడు పదార్థాలను ఒక రాతి క్వారీకి తరలిస్తున్న సమయంలో మావోయిస్టులు వాటిని దోచుకున్నారన్న పక్కా సమాచారంతో ఈ ఉమ్మడి ప్రత్యేక ఆపరేషన్‌ను చేపట్టారు. ఈ పేలుడు పదార్థాలు మావోయిస్టుల చేతిలో ఉంటే తీవ్ర కల్లోలం సృష్టించే ప్రమాదం ఉందని భావించిన భద్రతా దళాలు, మే 28వ తేదీన ఈ సెర్చింగ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఐదు రోజుల పాటు అటవీ ప్రాంతంలో జల్లెడ పట్టిన బలగాలు, చివరకు మావోయిస్టులు రహస్యంగా నిల్వ ఉంచిన 2.5 టన్నుల పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. అయితే, ఈ సెర్చింగ్ ఆపరేషన్ సమయంలో భద్రతా దళాలకు మావోయిస్టులు ఎవరూ తారసపడలేదు. దీనితో ఎటువంటి ఎదురుకాల్పులు జరగకుండానే ఈ ఆపరేషన్ ప్రశాంతంగా ముగిసింది. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను భారీ భద్రత నడుమ సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

# ఆయుష్ ఆసుపత్రి నుంచి వల్లభనేని వంశీ డిశ్చార్జి

**వేద న్యూస్, డెస్క్:**



అనారోగ్య కారణాలతో విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేడు డిశ్చార్జ్ అయ్యారు. ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యులు ఆయనను డిశ్చార్జ్ చేయగా, పోలీసులు తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. గత కొద్ది రోజులుగా శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న వల్లభనేని వంశీని, న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు మూడు రోజుల క్రితం విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యుల బృందం ఆయనకు ప్రత్యేక చికిత్స అందించింది. శ్వాస తీసుకోవడంలో ఉన్న ఇబ్బందులకు సంబంధించి అవసరమైన వైద్య సేవలు చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఇవాళ ఆయన్ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసేందుకు అనుమతించారు.

# సంపాదకీయం

## పార్లమెంటరీ డిప్లమసీ ప్రాముఖ్యత

పహల్గాం నేపథ్యంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని.. ప్రపంచానికి చెప్పటానికి మన పార్లమెంటు బృందాలు పలు దేశాలు పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేప థ్యంలో పార్లమెంటరీ దౌత్యం ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడం ముదావహం. రెండు దేశాల మధ్య వుండే చుట్టరికాన్ని దౌత్య సంబంధం అంటారు. ఇది రెండు ప్రభుత్వాల మధ్య నడిచే వ్యవహారం. ఈ వ్యవహారాన్ని నడపటానికి రాయబారులు, దౌత్య కార్యాలయాలు ఉంటాయి. ఇది ఒక ఎత్తైతే, రెండు దేశాల ప్రజల మధ్య సంబం ధాలను బలోపేతం చెయ్యటానికి అనధికార మార్గా లు చాలా ఉంటాయి. ఈ అనధికార మార్గాలు ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే వుంటాయి. కానీ వీటి పరిధి విశాలంగా ఉంటుంది. ఈ మార్గాల్లో పార్లమెంటరీ దౌత్యం ముఖ్యమైనది. ఒక దేశ పార్లమెంటు నెరిపే దౌత్యంతో మరో దేశం సులభంగా కనెక్ట్ అవుతుంది. ఇది ఇరు ప్రజలకు మధ్య వ్యవహారం. అందుకే పార్లమెంటరీ దౌత్యాన్ని ట్రాక్ 2 డిప్లమసి అంటారు. పార్లమెంటు సభ్యులకుండే సౌలభ్యం దౌత్యవేత్తలకు ఉండదు. దౌత్యవేత్తలు ఒక చట్రంలో పని చేస్తారు.పార్లమెంటరీ బృందాలు ఒప్పందాలు చెయ్య వు. ఒడంబడికలు కుదుర్చుకోవు. అవి చేసేదల్లా ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణం కలగ చెయ్యటమే. దౌత్యవేత్తలు ఒక మాట అన్నారంటే అది ప్రభుత్వ విధానం అవుతుంది. పార్లమెంటు సభ్యులు చెప్పేది ప్రజల మనోభావన. దానిలో ఒక భావోద్వేగం వుంటుంది. దాన్ని ప్రభుత్వ విధాన ప్రకటనగా చూడరు.

పైగా వారి భాష దౌత్య భాషకు భిన్నంగా వుం టుంది. అందుకే పార్లమెంటు సభ్యుల మాటలు వినే వారు బాగా కనెక్ట్ అవుతారు. పార్లమెంటరీ దౌత్యం లో మరో ముఖ్యమైన విషయం, స్వదేశంలో ప్రభు త్వానికి విపక్షాలకు అభిప్రాయ బేధాలున్నా, విదేశీ గడ్డ మీద అందరూ ఒకే మాట మీద నిలబడతారు. ఇది మన సంప్రదాయం. అందుకే పార్లమెంటు బృం దాలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసినా, వారి మాట పార్టీ విధానంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఉంటుంది. ఇది మన పార్లమెంటరీ సంప్రదాయపు ఔన్నత్యం. విదేశాలతో సంబంధాలు పూర్తిగా ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకునే పార్లమెంటు సభ్యులు వారి దౌత్యాన్ని నెరుపుతారు.పార్లమెంటరీ దౌత్యానికి ఫ్లెక్సిబిలిటీ ఉంటుంది. ఎందుకంటే దౌత్య అధికారు లకు లేని స్వేచ్ఛ వీరికి ఉంటుంది. అందుకనే కొన్ని సందర్భాల్లో ఒక ప్రభుత్వం మరో ప్రభుత్వానికి చెప్పటానికి వెనకాడే విషయాలను పార్లమెంటరీ దౌత్యం ద్వారా సాకారం అవుతుంది. పార్ల మెంటు బృందం ఒక దేశ పర్యటనకు బయల్దేరే ముందు ఆ బృందంలో సభ్యులు ఎవరు అనేది ఆయా పార్టీల నేతలు నిర్ణయిస్తారు. ప్రస్తుత సంద ర్భంలో ఆ సంప్రదాయాన్ని ప్రభుత్వం పాటించ లేదు. ఇటువంటి సమయంలో రాజకీయ కోణం లేకపోతే బాగుండేది. దేశ ప్రయోజనం ముఖ్యమైన ప్పుడు అన్ని పార్టీలను కలుపుకొని పోవాలి కదా. అలా చేయకపోవటం అనుచితం. దానిమీద వివాదం చెయ్యటానికి ఇది సరైన సమయం కాదు. పార్లమెంటరీ బృందం పర్యటనకు ఒక దేశం వెళ్లే ముందు చాలా కసరత్తు ఉంటుంది. అక్కడ చర్చల్లో ఏ అంశాలు ప్రస్తావనకు వస్తాయి? దానికి మన వారి స్పందన ఎలా వుండాలి? అవతలి వారితో మనం ఏ అంశాలను, ఏ మేరకు కదపాలి? అన్న విషయాల మీద విదేశాంగ శాఖ అధికారులు పార్లమెంటు సభ్యుల బృందానికి బ్రీఫింగ్ ఇస్తారు. సదరు బృందం పర్యటించే దేశానికి మనకు మధ్య వున్న సంబంధాల బలం, బలహీనత లాంటి అంశా లను అధికారులు వివరిస్తారు. ఆ అవగాహనతో పార్లమెంటు సభ్యులు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తారు.

ప్రభుత్వ అధినేతలుగానీ, మంత్రులుగానీ, దౌత్య అధికారులుగానీ వ్యవహరించటానికి కొన్ని ప్రోటోకాల్స్ వుంటాయి. పార్లమెంటు సభ్యులు ఈ ప్రోటోకాల్ చట్రంలో వుండరు. వీరికుండే సౌలభ్యం దౌత్యవేత్తలకు ఉండదు. పార్లమెంటు సభ్యులకు అనేక వర్గాలతో మాట్లాడుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఆ వర్గాల వారు పార్లమెంటు సభ్యులతో పాటుగా, ఆ దేశ మేధావులు, కవులు, కళాకారులు, విద్యా వేత్తలు, మీడియా సంస్థలు, అక్కడ స్థిరపడిన మన దేశపు సంతతి వారు.. వీరందరితో కలివిడిగా మాట్లాడే అవకాశం పార్లమెంటు బృందాలకు ఉంటుంది. అందుకే 'ఆపరేషన్ సిందూర్'ను ప్రపం చానికి చెప్పటానికి, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కూడగట్టటానికి భారత ప్రభుత్వం పార్లమెంటరీ బందాలను పలు దేశాలకు పంపిస్తోంది.

ఈ మధ్యకాలంలో దేశాల ప్రజల మధ్య ద్వైపాక్షిక సత్సంబంధాలు బలోపేతం అవ్వటానికి పార్లమెంటు దౌత్యం ఒక ముఖ్యమైన ఛానల్గా ప్రాచుర్యంలోకి వచ్చింది. పార్లమెంటు బృందాలు మరో దేశంలో పార్లమెంటు సభ్యులకు మన దేశం పట్ల సుహృద్భావ వాతావరణం కలిగిస్తాయి. అలాగే ఇతర దేశాల పార్లమెంటు బృందాలు కూడా మన దేశంలో పర్యటించినప్పుడు వారి దేశపు విధానాలకు అవగాహనా కల్పిస్తుంటాయి. ఇది పార్లమెంటరీ వ్యవస్థలో నిరంతరం జరిగే ప్రక్రియ. పార్లమెంటరీ దౌత్యాన్ని బలోపేతం చెయ్యటానికి మన దేశంలో పార్లమెంటరీ మైత్రీ సంఘాలు వున్నాయి. అవి రష్యా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, మంగోలియా, వియత్నాం, శ్రీలంక, యూరోపియన్ యూనియన్, లాటిన్ అమెరికా లాంటి ప్రాంతాలతో అనుసంధా నమై మైత్రీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు బహు పాక్షిక పార్లమెంటు సంబం ధాలు నెరపటానికి కొన్ని అంతర్జాతీయ వేదికలు న్నాయి. అందులో ముఖ్యమైనవి కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ), మరొకటి ఇంటర్ పార్ల మెంటరీ యూనియన్ (ఐపీ యూ). ఈ వేదికలు నిర్వహించే సమావేశాలు ఒక ఎజెండా ప్రకా రం నడుస్తాయి. ఉదాహరణకు పర్యావరణ సమతుల్యం, ఆహార భద్రత, బాలల హక్కుల పరిరక్షణ, లాంటి అంశాలు. ద్వైపాక్షిక సంప్రదింపులు ఒక ఎజెండా చట్రంలో ఇరుక్కొని వుండవు. 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు చేపట్టవలసి వచ్చిందీ ప్రపంచానికి చెప్పటానికి మన పార్లమెంటు సభ్య లు సరైన ప్రతినిధులు. ఉగ్రవాద ఘాతుకాలకు మనం బలి అవుతున్నాం కాబట్టి మన పోరాటం మనం చెయ్యాలి.


# ఎండుతున్న పాక్ డ్యామ్ లు

**– రెండు కీలక డ్యామ్లలో సగానికి పడిపోయిన నీటి నిల్వలు – సాగునీటి సంక్షోభం, ఖరీఫ్పై తీవ్ర ప్రభావం పడనుందని ఆందోళన**

**వేద న్యూస్, డెస్క్:**

పహల్గామ్ ఉగ్రదాడిపై తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం పాకిస్థాన్ తో గతంలో జరిగిన సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ వ్యూహాత్మక నిర్ణయం ప్రస్తుతం ప్రభావం చూపిస్తోంది. సింధు జలాలను నిలిపివేయడంతో పాకిస్థాన్ లో నీటి కరవు ఏర్పడింది. ఇది పాకిస్థాన్ లో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. పాకిస్థాన్లోని కీలకమైన మంగ్లా (జీలం నదిపై), తర్బేలా (సింధు నదిపై) డ్యామ్లలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోవడంతో ఖరీఫ్ (వేసవి పంటల) సాగు ప్రమాదంలో పడింది. ఈ రెండు డ్యామ్లు పాకిస్థాన్లోని పంజాబ్, సింధ్ ప్రావిన్స్లలో వ్యవసాయానికి, జలవిద్యుత్ ఉత్పత్తికి అత్యంత కీలకం. ప్రస్తుత నీటి కొరత ఈ నెలలో ఖరీఫ్ సాగు ప్రారంభమయ్యే నాటికి మరింత తీవ్రరూపం దాల్చవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిణామాలపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన హిమానీనదాల పరిరక్షణపై అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, సింధు నదీ బేసిన్ నీటి పంపకాన్ని నియంత్రించే సింధు జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా నిలిపివేసిందని ఆరోపించారు. సింధు నదీ వ్యవస్థ అథారిటీ (ఐఆర్ఎస్ఏ) తాజా అంచనాల ప్రకారం, పాకిస్థాన్ మొత్తం నీటి ప్రవాహంలో 21% కొరతను, రెండు కీలక డ్యామ్లలో దాదాపు 50% నీటి నిల్వల కొరతను ఎదుర్కొంటోంది. భారత్ నుంచి చీనాబ్ నది ప్రవాహాలు అకస్మాత్తుగా తగ్గడం వల్ల ఖరీఫ్ సీజన్ ఆరంభంలో నీటి కొరత మరింత పెరుగుతుందని ఐఆర్ఎస్ఏ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, సింధు జలాల ఒప్పందం ఉల్లంఘనకు తమను నిందించడం మానుకోవాలని భారత్ పాకిస్థాన్కు స్పష్టం చేసింది. తజికిస్థాన్లోని దుషాన్బేలో



జరిగిన ఐక్యరాజ్యసమితి హిమానీనదాల సదస్సులో కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ మాట్లాడుతూ.. పాకిస్థానే ఉగ్రవాదం ద్వారా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని అన్నారు. "ఈ వేదికను దుర్వినియోగం చేసి, సంబంధం లేని అంశాలను ప్రస్తావించడానికి పాకిస్థాన్ చేసిన ప్రయత్నాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము" అని ఆయన వ్యాఖ్యానించారు.

# మిలటరీ క్యాంపుపై కొండచరియలు





**వేద న్యూస్, సిక్కిం:**

ఈశాన్య భారతంలో వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. సిక్కిం లోని ఛటేన్లో మిలటరీ క్యాంపుపై కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు భద్రతా సిబ్బంది మృతిచెందగా.. ఆరుగురి జాడ గల్లంతయింది. ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో భారీగా వర్షాలు కురియడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు రక్షణ శాఖ అధికారి ఒకరు సోమవారం నాడు ప్రకటన జారీ చేశారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టామని, ఇంతవరకూ మూడు మృతదేహాలను వెలికి తీశామని సదరు అధికారి వెల్లడించారు. నలుగురికి స్వల్ప గాయాలయినట్టు చెప్పారు. జాడగల్లంతైన ఆరుగురి కోసం గాలిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సిక్కింలో గత వారం రోజులుగా ఎడతెగని వర్షాలు కురుస్తుండటంతో కొండచరియలు విరిగిపడుతున్నాయి. తీస్తా నది ప్రమాదకర స్థాయి దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలను అప్రమత్తం చేశారు. నార్త్ సిక్కింలోని తీంగ్, చుంగ్తాంగ్లో కొండచరియలు విరిగిపడటంతో పలు రోడ్లు మూసివేశారు. కాగా, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయాలోనూ భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అసోంలోని పలు ప్రధాన నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో 20కి పైగా జిల్లాల్లో వరదనీటితో ప్రజలు ఇక్కట్లుపడుతున్నారు. నైరుతి రుతుపవనాలు రావడంతో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం అరుణాచల్ ప్రదేశ్లో నమోదయిన్నట్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అవసరమైన సహాయక చర్యలు చేపడుతోందని చెప్పారు.



# 16 మంది నక్సలైట్లు లొంగుబాటు

**వేద న్యూస్, డెస్క్:**

వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలో నక్సల్స్ను నిర్మూలించడాన్ని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోవడంతో వారి లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. ఛత్తీస్గఢ్ లోని సుక్మా జిల్లా పోలీసుస్టేషన్లో 16 మంది నక్సలైట్లు సోమవారం నాడు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లపై రూ. 25 లక్షల రివార్డు ఉన్నట్టు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. వీరిలో తొమ్మిది మంది చింతలనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోకి వచ్చే కెర్లపెండ విలేజ్ పంచాయతీకి చెందిన వారు ఉన్నారు. మావోయిస్టు సిద్ధాంతాలు, స్థానిక గిరిజనులపై అకృత్యాలకు విసిగిపోయి, ప్రభుత్వ పునరావాస విధానంతో జనజీవన స్రవంతిలో కలవాలని లొంగిపోయిన నక్సలైట్లు కోరుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

**– నక్సల్స్ రహిత గ్రామంగా కెర్లపెండ..**

పదహారు మంది నక్సలైట్లలో 9 మంది కెర్లపెండ గ్రామానికి చెందినవారే కావడంతో ఆగ్రామం నక్సల్స్ రహిత గ్రామంగా మారినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వ స్కీమ్ ప్రకారం కోటి రూపాయలతో ఈ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. ఛత్తీస్గఢ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నియద్ నల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) పథకం పట్ల వీరంతా ఆకర్షితులయినట్టు చెబుతున్నారు. లొంగిపోయిన వారిలో రీటా అలియాస్ దోడి సుక్కి (36) అనే మహిళ మావోయిస్ట్ సెంట్రల్ రీజనల్ కమిటీ (సీఆర్ఎస్)లో చురుకుగా వ్యవహరిస్తోంది. రాహుల్ పునెం (18) పీఎల్జీఏ సభ్యుడిగా ఉన్నారు. వీరి ఒక్కొక్కరిపై రూ. 8లక్షల రివార్డు ఉంది. మరొకరిపై రూ. 3లక్షలు, ముగ్గురిపై రూ. 2లక్షల చొప్పున రివార్డు ఉంది. కాగా, గత ఏప్రిల్లో బడేసట్టి గ్రామాన్ని నక్సల్స్ రహిత గ్రామంగా ప్రకటించారు.




# ఢిల్లీలో విమానానికి తప్పిన ముప్పు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ క్రమంలో, ఇండిగోకు చెందిన ఓ విమానం ల్యాండింగ్ సమయంలో తీవ్రమైన కుదుపులకు లోనవడంతో పైలట్ ల్యాండింగ్ను రద్దు చేశాడు. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రాయ్పూర్ నుంచి ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న ఇండిగో విమానం 6ఈ 6313 ల్యాండింగ్కు కొన్ని నిమిషాల ముందు ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం నేలను తాకే సమయంలో వాతావరణం ఒక్కసారిగా ప్రతికూలంగా మారింది. గాలి వేగం గంటకు 80 కిలోమీటర్లకు చేరడంతో విమానం తీవ్రంగా కుదుపులకు లోనైంది. దీంతో అప్రమత్తమైన పైలట్ ల్యాండింగ్ సురక్షితం కాదని భావించి, విమానాన్ని తిరిగి గాల్లోకి తీసుకెళ్లాడు. ఆ సమయంలో విమానం లోపల ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. కిటికీ నుంచి చూస్తే బయట ఏమీ కనిపించనంతగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం 5:05 గంటలకు ల్యాండ్ కావాల్సిన విమానం కొంతసేపు గాల్లోనే చక్కర్లు కొట్టిన అనంతరం 5:43 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు ఓ హెచ్చరిక జారీ చేశారు. ప్రతికూల వాతావరణం కారణంగా విమాన సర్వీసులపై ప్రభావం పడే అవకాశం ఉందని సూచించారు.

# హైదరాబాద్లో శ్రీకాకుళంకు చెందిన యువకుడు ఆత్మహత్య



**వేద న్యూస్, హైదరాబాద్ :**

శ్రీకాకుళానికి చెందిన యువకుడు హైదరాబాద్లో ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళానికి చెందిన గొట్టివాడ చిన్న (35) అనే వ్యక్తి పెయింటర్గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో విభేదాలు రావడంతో కొంతకాలంగా హైదరాబాద్లోని గచ్చిబౌలిలో తన చెల్లెలి ఇంట్లో ఉంటున్నాడు. నిన్న అతను బొటానికల్ గార్డెన్ ఫ్లైఓవర్ నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం జూన్ 3, 2025



## ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన పోలీస్ సిబ్బంది

**వేద న్యూస్, కాజీపేట :**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వుల మేరకు కాజీపేట ఏసీపి ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్, కాజీపేట డివిజనల్ సిబ్బందితో ఫాతిమా వద్ద నుండి దర్గా వరకు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రజలకు భద్రత, భరోసా కల్పించడం కొరకు ప్రతిరోజు ఒకచోట ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట, మడికొండ, ధర్మసాగర్ సిఐలు, కాజీపేట ట్రాఫిక్ సిఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

దామరచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఆవరణములో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ మహోత్సవము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలుమంగ,ఏ.ఈ సతీష్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది,దామచర్ల తాహసిల్దార్ జవహర్ లాల్,తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు,మాజీ ఎంపిటీసీ నందిని రవితేజ,మాజీ సర్పంచ్ బంటు కిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్,టిడిపి నాయకుడు మాన్య నాయక్ లతోపాటు పలువురు మండల ప్రముఖులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు చిరు సన్మానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం పురస్కరిం చుకొని కాశిబుగ్గలోని సొసైటీ కాలనీలో నివాస ఉంటున్న పాశికంటి సత్యనారాయణ, సరోజనలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో మేనేజ్ ఇంట్రెస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజేషన్ శ్రవణ్, ప్రముఖ జ్యోతిష్యుడు పాశికంటి వాసుదేవ్ పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ కోసం పోరాడాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




సామాజిక తెలంగాణ రాష్ట్రం కోసం బడుగు,బలహీన వర్గాలు కలిసి పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ భౌగోళిక తెలంగాణ రాష్ట్రం సాధించాం కానీ సామాజిక తెలంగాణ రాష్ట్రం ఇంకా సాధించలేదని,సామాజిక తెలంగాణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటాలు,కేసులు, ఆత్మహత్యలు,బలిదానాలు, త్యాగాలు చేసింది బీసీ,ఎస్సీ, ఎస్టీలని.వచ్చిన రాజ్యాన్ని అనుభవిస్తుంది అగ్రకులాలని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హంస అధ్యక్షుడు నామసైదులు, తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎం. శ్రీకాంత్ యాదవ్,తెలంగాణ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు యోగా ధ్యానమే మార్గం

**వేద న్యూస్, శాయంపేట:**

మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరికి యోగ ధ్యానం అవసరమని శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ అన్నారు. ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు శాయంపేట మండల కేంద్రంలోనీ నవోదయ ఉన్నత పాఠశాలలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగా జ్ఞాన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఎస్సై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మనిషి తన శరీరాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంచుకునేందుకు స్నాన పానాధులు ఎలా అవసరమో మనసుని హృదయాన్ని పరిశుభ్రంగా స్వచ్ఛంగా ఉంచుకునేందుకు ధ్యానం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగ, ధ్యాన శిక్షణ కార్యక్రమంలో యువకులు విద్యార్థులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు. శ్రీ రామచంద్ర మిషన్ సంస్థ కోఆర్డినేటర్ ఎం శారద, జిల్లా కోఆర్డినేటర్ జి అచ్చయ్య, కే రమేష్, రాంబాబు, సత్యనారాయణ, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.



# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**





మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే బిఎల్ఆర్ పట్టణ నాయకులతో కలిసి పూలమాలను వేసి నివాళులు అర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి కళాభారతి వరకు జాతీయ జెండాలు, బతుకమ్మలు, పోలీస్ సిబ్బంది డ్రగ్స్ మరియు సారా నిషేధంపై బ్యానర్ ప్రదర్శన,ఇరిగేషన్ డిపార్ట్మెంట్,ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో బ్యానర్ లతో, మహిళలు బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ లు ప్రారంభించారు.

### నియోజకవర్గ అభివృద్ధిని ఎవరు ఆపలేరు:ఎమ్మెల్యే బిఎల్ఆర్

కళాభారతి వద్ద అధికారులతో కలిసి జాతీయ జెండాను ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణ సమస్యలపై వారి కార్యాచరణపై ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ పవర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అదే సమయంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించారు. దశాబ్ద కాలంగా మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి పేరుతో గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. తాము అధికారం చేపట్టే నాటికి వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గాన్ని గాడిన పెట్టి, అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు.ఈ క్రమంలో అబివృద్ధిని ఓర్వలేక గతంలో జరిగిన అవినీతి వెలుగులోకి వస్తుండటంతో కొందరు జీర్ణించుకోలేక సోషల్ మీడియాకు ఎక్కి పనికిరాని రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీలకు అతీతంగా మిర్యాలగూడ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే గత కొద్ది సంవత్సరాలుగా బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినూత్న కార్యక్రమం ఈశ్వర బంధం కార్యక్రమం నేటి నుండి ప్రారంభిస్తునట్టు ప్రకటించారు. పత్యేక రాష్ట్ర సాధనలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకున్నారు.సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మల్టీ పర్పస్ సిబ్బందికి ప్రతీ సంవత్సరం తన సొంత డబ్బుతో బిఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ మరియు లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయిస్తానని వారికి చెక్కును అందజేశారు.

అదేవిధంగా మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ కోసం నూతనంగా మంజూరైన 12 టాటా ఏసీ వాహనాలను,ఆరు ట్రాక్టర్లను మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు,తెలంగాణ ఉద్యమ నాయకులు,వివిధ పార్టీల నాయకులు,ఉద్యోగ సంఘాలు, ప్రైవేట్ సంస్థలు వ్యాపారస్థులు,స్వచ్ఛంధ సంస్థల వారు,పలు విభాగాల అధికారులు,ఉద్యోగులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర రావు రాష్ట్ర ప్రజలందరికీ మరియు మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ తెలిపారు. ఎందరో అమరుల బలిదానం,సబ్బండ వర్గాల మరియు నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష,బిఆర్ఎస్ నాయకుడు కెసిఆర్ ఉద్యమ ఫలితమే ఈ మన తెలంగాణ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మిర్యాలగూడ పట్టణం రెడ్డికాలనీలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డా.బాబాసాహెబ్అంబేద్కర్,తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ల చిత్ర పటాలకు వందనాలు సమర్పణ చేసి జాతీయ జెండాను,బిఆర్ఎస్ పార్టీ జెండాను మాజీ శాసన సభ్యులు,మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు నల్లమోతు భాస్కర్ రావు,మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో నల్లగొండ జిల్లా రైతు బంధు మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఏఎంసీ ఛైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్,ఉద్యమ నాయకులు యడవెల్లి శ్రీనివాస రెడ్డి,రాష్ట్ర సీనియర్ నాయకులు అన్నబీమోజు నాగార్జునచారి, జొన్నలగడ్డ రంగా రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎండి. మాగ్ధూమ్ పాషా, టిఆర్ఎస్పార్టీ నల్లగొండ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఎండి. షెహనాజ్ బేగం,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి.ఇలియాస్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు మట్టపల్లి సైదయ్య యాదవ్, ఎండి. మాజీద్,బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎండి.షోయబ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ కుర్ర చైతన్య,నల్లగంతుల నాగభూషణం నాగరాజు,మహిళా అధ్యక్షురాలు పెండ్యాల పద్మ, మహిళా కార్యదర్శి కోదాటి రమా, మహిళా నాయకులు ధనమ్మ, చిత్రం ఉమా,స్వర్ణలత,రాధ,బుజ్జి లతోపాటు బిఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ కౌన్సిలర్లు,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపిటీసీలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల స్మృతిలో రాష్ట్రంలో ప్రజాపాలన

- **కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

**వేద న్యూస్, శాయంపేట:**



తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్రాన్ని సుసంపన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుచ్చిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, సాంకేతికంగా పురోగతి చెందుతుందని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలలో పాటు పర్యావరణంలో ప్రపంచం తెలంగాణ వైపు చూస్తుందని కొనియాడారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మండల ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా చక్రపాణి, దుబాసి కృష్ణమూర్తి, వైనాల కుమారస్వామి, చిందం రవి, మసికే కుమార్, సాధు నాగరాజు, మరపెల్లి రాజేందర్, బాసని రవి, వరదరాజు, ప్రపంచ రెడ్డి, లడే రాజ్ కుమార్, పత్తి శీను, సుదర్శన్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

- **ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి**

**వేద న్యూస్, వరంగల్:**



త్వరలోనే ఉపాధ్యాయ, ఉద్యోగులు సమస్యలు పరిష్కారం అవుతాయని వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖిలా వరంగల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు హాజరైన శ్రీపాల్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ముందుగా మంత్రి పొం గులేటిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో సంక్షమా కార్యక్రమాలతో బడుగు బలహీన వర్గాల సంక్షేమనికి పాటుపాడుతుందని త్వరలోనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమావుతాయాని, సమస్యల సాధనకి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వారు సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్‌నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు, పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, నల్లబెల్లి మండల అధ్యక్షుడు నకిరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'పొగాకు'కు మద్దతు ధర చెల్లించాలి

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



ఎల్కతుర్తి మండల పరిధిలోని రైతులు సాగు చేసిన పొగాకుకు కాంట్రాక్టర్ మద్దతు ధర చెల్లించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి(టీఆర్ఆర్ఎస్) హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ మద్దతు ధర చెల్లించని యెడల రైతుల పక్షాన రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు 100 ఎకరాల్లో గత 20 సంవత్సరాలుగా పొగాకు పంటను సాగు చేస్తున్నారని చెప్పారు. పండిన పంటను వీఎస్టి టీ లిమిటెడ్ కంపెనీకి మద్దతు ధరకు విక్రయించగా, ఈ ఏడాది గతంలో చెల్లించిన ధరకు భిన్నంగా ప్రాంతానికో ధర చెల్లిస్తున్నారని వెల్లడించారు. చింతలపల్లికి చెందిన రైతులు సుమారు 800 క్వింటాళ్ల పొగాకును వీఎస్టి కంపెనీకి విక్రయించగా, కిలో పొగాకుకు రూ.60 నుంచి రూ.80 వరకు మాత్రమే ధర నిర్ణయించా రని తెలిపారు. ఇదే నాణ్యతతో ఉన్న పొగాకుకు రఘునాథపల్లిలో కిలోకు రూ.100 నుంచి రూ.120 వరకు చెల్లించారని ఆరోపించారు. సదరు కంపెనీ కాంట్రాక్టర్ వెంటనే రైతులకు న్యాయం చేయాలని కోరారు. అన్నదాతను మోసగించిన కంపెనీ యాజ మాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే మా అజెండా

**మొదటి పేజీ తరువాయి**

సాధ్యమవుతాయని, ఆ లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం, మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యల కారణంగా దేశంలోనే తెలంగాణ పోలీసు అగ్రస్థానంలో నిలవడానికి కారణమైన వివరాలను ముఖ్యమంత్రి సవివరంగా తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వేదికగా మార్చుతూ, ప్రపంచవ్యాప్తంగా వందకుపైగా దేశాల నుంచి దాదాపు 450 మంది ప్రతినిధులు హాజరైన భారత్ సమ్మిట్ నిర్వహణ, తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో మన సంస్కృతి, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటాలన్న లక్ష్యంతో 72 వ మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ వంటి అంశాలను చెప్పారు. దేశ రక్షణ, సమగ్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్రానికి మద్దతుగా తెలంగాణ నిలిచింది. పహల్గామ్ దాడుల ఘటనలో భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ మద్దతుగా నిలిచిన అంశాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది ప్రముఖులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పురస్కారాలను అందించారు. అలాగే, వివిధ కేటగిరీల్లో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు గ్యాలంటరీ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర మరువలేం

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. సమాజం ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర అభివృద్ధి లో పోలీసులు కృషి చేస్తున్నారని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో పోలీస్ శాఖ సిబ్బంది మనస్ఫూర్తిగా కర్తవ్య నిర్వహణ చేయాలని, సంఘ విద్రోహుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలకు భరోసా కల్పిస్తూ ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ ఒకే రకమైన సేవలు అందించాలని అన్నారు. అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో మరింత బాధ్యతగా పనిచేసి, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయి లో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు ఇంకా మంచి పేరు, కీర్తి ప్రతిష్ట లు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం పోలీస్ సిబ్బందికి చిన్న పిల్లలకు ఎస్పీ మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ ఐపీఎస్, కాగజ్నగర్ డిఎస్పి రామానుజం, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది, ఇతర సిబ్బంది హాజరయ్యారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073